
## 335.04 ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయింపు

యూనివర్సిటీ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ 335.04 ఎకరాల భూమిని కేటాయించింది. తొలుత కేంద్రం మొత్తం 500 ఎకరాలు అవసరముందని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించగా రెవెన్యూ, ఫారెస్ట్ శాఖకు సంబంధించి 487ఎకరాల 4గుంటల భూమిని గుర్తించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం రెవెన్యూకు సంబంధించిన సర్వే నంబర్ 837లోని 274 ఎకరాల ప్రభుత్వ భూమిని అధికారులు, సిబ్బందితో సర్వే చేయించి 120 ఎకరాల భూమిని అప్పగించారు. జీపీఎస్ సర్వే సైతం చేయించారు. మిగిలిన అటవీశాఖ భూమిని బదలాయింపులో భాగంగా అప్పగించాలని ఫారెస్ట్ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వారు సుముఖత వ్యక్తం చేసి సర్వే చేపట్టి భూమిని రెవెన్యూ శాఖకు బదలాయించారు. ఈ క్రమంలో 2018 డిసెంబర్ 31న కేంద్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి ఆర్. సుబ్రహ్మణ్యం, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఉప కులపతి అప్పారావు, సెంట్రల్ పబ్లిక్‌వర్సిటీ సీఈ సాంబశివరావు బృందం జిల్లాలో పర్యటించి కేటాయించిన భూములను పరిశీలించి అనువైనవేనని కేంద్రానికి నివేదిక సమర్పించారు. ప్రస్తుతానికి ఫారెస్ట్, రెవెన్యూ శాఖలకు సంబంధించి 335.04ఎకరాల ప్రభుత్వ భూమిని సిద్ధం చేసి కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖకు అప్పగించారు. దీంతో కేంద్ర ప్రభుత్వం గత రెండు బడ్జెట్లలో ఇప్పటి వరకు రూ.19కోట్లు కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం తమ వంతు పాత్ర పోషించి జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో సదరు స్థలానికి శాశ్వత ప్రాతిపదికన హద్దు రాళ్లు వేసింది.








## ములుగుకు ప్రత్యేక గుర్తింపు

ఏజెన్సీ ప్రాంతమైన ములుగు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ హయంలో అభివృద్ధి వైపు అడుగులు వేస్తూ కొత్త జిల్లాగా రూపాంతరం చెందింది. ఇప్పుడు దేశంలోనే అతిపెద గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు కానుండడంతో ములుగుకు ప్రత్యేక గుర్తింపు దక్కనుంది. మధ్యప్రదేశ్‌లోని అమర్‌టంక్ జిల్లాలో మొదటి గిరిజన యూనివర్సిటీని రూ.1100కోట్లతో నెలకొల్పారు. రెండోది ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటైంది. అంతకు మించిన వ్యయంతో మూడో యూనివర్సిటీ ములుగులో ఏర్పాటు కానుంది. గట్టమ్మ ఆలయం పరిసరాల్లో 163 జాతీయ రహదారికి ఆనుకొని యూనివర్సిటీ ఏర్పాటు కానుండడంతో రవాణా పరంగా ఎలాంటి ఇబ్బందులు ఉండవు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు, సిబ్బంది వరంగల్ రైల్వే స్టేషన్‌కు వచ్చి గంటలో ములుగుకు చేరుకోవచ్చు.

# గిరిజన వర్సిటీ కల సాకారం

**ములుగుకు మణిహారంలా విశ్వవిద్యాలయం**



### రూ.889.07 కోట్లతో ఏర్పాటు .. 10ఏళ్లకు నెరవేరిన విభజన హామీ

**బిల్లు ఆమోదంతో మార్గం సుగమం.. యూనివర్సిటీకి మేడారం వన దేవతల పేరు**

**335.04ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయింపు.. 2018లోనే స్థల పరిశీలన పూర్తి**

ములుగు, డిసెంబర్ 8 (నమస్తేతెలంగాణ) : గిరిజనులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తేవడంలో భాగంగా ములుగు జిల్లా కేంద్రంలోని గట్టమ్మ ఆలయ పరిసర ప్రాంతంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు కాన్నుది. ములుగు కేంద్రంగా ఏర్పాటయ్యే యూనివర్సిటీ రాష్ట్రానికే తలమానికం కానుంది. ఉమ్మడి రాష్ట్రం విభజన చట్టమైన సెక్షన్ 93 షెడ్యూల్13(3) ప్రకారం తెలంగాణకు వచ్చిన గిరిజన యూనివర్సిటీ అన్ని విధాలా సౌలభ్యంగా, సౌకర్యంగా ఉన్న ములుగు ప్రాంతంలో ఆవిష్కృతం కానున్నది. తెలంగాణ ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్ ఎంపీలు, మంత్రులు, ఢిల్లీలో ప్రధాన మంత్రితో పాటు కేంద్ర మంత్రులను కలిసి ఎన్నో సార్లు యూనివర్సిటీ ఏర్పాటుపై విజ్ఞప్తి చేశారు. ఇందులో భాగంగా కేంద్ర మానవవనరుల అభివృద్ధి శాఖ చీఫ్ సెక్రటరీ 2018 డిసెంబర్ 31న యూనివర్సిటీ ఏర్పాటు కోసం కేటాయించిన భూములను పరిశీలించి తుది నిర్ణయం తీసుకున్నారు. భవన నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించడంతో పాటు యూనివర్సిటీ ఏర్పాటుకు, తాత్కాలిక తరగతుల నిర్వహణ కోసం ములుగు మండలం జాకారంలోని వైటీసీ భవనాన్ని సైతం కేటాయించింది. భూములను కేంద్ర ప్రభుత్వానికి అప్పగించిన అనంతరం ప్రధాని మోదీ ఇటీవల మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన బహిరంగసభలో ములుగు జిల్లా కేంద్రంగా గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ యూనివర్సిటీని మేడారం సమ్మక్క సారలమ్మ పేర్లతో నిర్మించనున్నట్లు స్పష్టం చేశారు. ఎన్నికల అనంతరం ఈ నెల 4న లోక్‌సభలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు బిల్లును కేంద్రం ప్రవేశపెట్టగా ఈ నెల 7న మూజువానీ ఓటుతో ఆమోదించింది. లోక్‌సభలో ఆమోదించిన బిల్లును రాజ్యసభ కూడా ఆమోదం అనంతరం రాష్ట్రపతి ఆమోదం కోసం పంపనున్నారు. ములుగులో రూ.889.07 కోట్లతో యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర విద్యాశాఖ మంత్రి లోక్‌సభలో వెల్లడించారు.

### గిరిజన విద్యార్థులకు వరం : మాజీ మంత్రి సత్యవతి



మహబూబాబాద్ రూరల్ : ములుగులో సమ్మక్క సారలమ్మ గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు లోక్‌సభ ఆమోదం తెలుపడం హర్షించదగిన విషయం. గల్లీ నుంచి ఢిల్లీ వరకు బీఆర్ఎస్ పోరాటాల వల్లే ములుగులో యూనివర్సిటీ ఏర్పాటవుతున్నది. కేంద్ర ప్రభుత్వ పెద్దలకు మాజీ సీఎం కేసీఆర్ ఎన్నోమార్లు యూనివర్సిటీపై విన్నవించారు. విభజన చట్టంలోనే ఉన్నా కేంద్ర ప్రభుత్వం పదేండ్లు కాలయాపన చేసింది. ఏజెన్సీ ప్రాంతమైన ములుగు కేసీఆర్ హయాంలోనే అన్ని విధాలా అభివృద్ధి చెందింది. గిరిజన విశ్వవిద్యాలయం ఈ ప్రాంత వాసులకే కాకుండా ఇతర ప్రాంతాల విద్యార్థులకు వరంలా మారనుంది.

### బీఆర్ఎస్ కృషి వల్లే.. : ఎంపీ మాలోత్ కవిత



మానుకోట పార్లమెంట్ పరిధిలోని ములుగు జిల్లాలో గిరిజన యూనివరర్సిటీ ఏర్పాటుకు లోక్‌సభ ఆమోదం లభించడం సంతోషంగా ఉంది. యూనివర్సిటీలో ఈ ప్రాంత గిరిజన విద్యార్థులకు ఎంతో ప్రజయోజనం కలుగుతుంది. గతంలో కేసీఆర్ నాయకత్వంలో కేంద్రానికి బీఆర్ఎస్ ఎంపీలు అనేక మార్లు విన్నవించడం వల్లే ఇప్పుడు కల సాకారమవుతున్నది. యూనివర్సిటీ ఏర్పాటు విషయం విభజన చట్టంలో స్పష్టంగా ఉన్నా ఈ ప్రాంతవాసులను కేంద్ర ప్రభుత్వం కాలయాపనతో ఇబ్బంది పెట్టింది. ఇప్పటికైనా ఈ ప్రాంత వాసుల కోరిక నెరవేరుతున్నందుకు ఆనందంగా ఉంది.



గట్టమ్మ వద్ద ఉన్న గిరిజన యూనివర్సిటీ భూములు (ఫైల్)

# మిగ్‌జాం.. ఇగం

*ఉమ్మడి వరంగల్ జిల్లాను పొగ మంచు కమ్మేసింది. శుక్రవారం తెల్లవారుజుమున దట్టమైన పొగమంచు కమ్మేయడంతో వాహనదారులు, ప్రజలు బయటకు వెళ్లేందుకు ఇబ్బంది పడ్డారు. ముఖ్యంగా భూపాలపల్లి, ములుగు, హనుమకొండలో తీవ్ర ప్రభావం కనిపించింది. వాహనాల్లో వెళ్లే వారు లైట్లు వేసుకుని ప్రయాణించాల్సి వచ్చింది. తెల్లవారుజాము నుంచి తొమ్మిది గంటల వరకు సూర్యుడు బయటకు రాకపోవడం, మంచు కురుస్తూనే ఉండడం ఇబ్బందిని కలిగించింది. ఎటుచూసిన మంచు తెరలతో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. మూడు రోజులుగా తుఫాన్ ప్రభావంతో వానలు పడి శుక్రవారం తేరుకుంది. ఈ క్రమంలోనే పొగమంచు దట్టంగా అల్లుకోవడంతో ధాన్యం రైతులు ఇబ్బందులు పడ్డారు. చలి పెరగడంతో వృద్ధులు, పిల్లలు అవస్థలు పడ్డారు.*

**- భూపాలపల్లి, ములుగు ఫొటోగ్రాఫర్లు/ గోవిందరావుపేట/ నర్సంపేట రూరల్, శాయంపేట, డిసెంబర్ 8**



గోవిందరావుపేట : లక్నవరం సరస్సును కమ్మేసిన పొగమంచు



భూపాలపల్లిలో ప్రధాన రహదారిపై లైట్ల వెలుతురు ప్రయాణిస్తున్న వాహనదారులు






భూపాలపల్లిలో..



నర్సంపేట రూరల్ : ఇటుకాలపల్లి ప్రధాన రహదారిపై..



గోవిందరావుపేటలో ప్రధాన రహదారిపై..



భూపాలపల్లిలో..

## నేతలతో ఎమ్మెల్సీ కవిత సమీక్ష

సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో విజయం సాధించేందుకు ఎమ్మెల్సీ, టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు కవిత కోల్‌బెల్ట్ ఏరియా టీబీజీకేఎస్ నేతలతో ప్రత్యేకంగా సమీక్షిస్తున్నారు. టీబీజీకేఎస్ అగ్రనేతలు వెంకట్రావ్, మిర్యాల రాజిరెడ్డి, కెంగర్ల మల్లయ్యతో కవిత ప్రత్యేకంగా భేటీ అయి పరిస్థితులపై సమీక్షించారు. గురువారం రాత్రి భూపాలపల్లి, మణుగూరు, ఇల్లెందు, కొత్తగూడెం ఏరియాల టీబీజీకేఎస్ ముఖ్య నాయకులతో రివ్యూ నిర్వహించారు. క్రమక్రమంగా మిగిలిన డివిజన్ల నాయకులతో సమీక్షలు జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ముఖ్యంగా సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలు పోగొట్టిన జాతీయ సంఘాల పనితీరును ఎండగట్టాలని, వారసత్వ ఉద్యోగాలు ఇప్పించిన టీబీజీకేఎస్‌ను ఆదరించాలని, కార్మికుల్లోకి వెళ్లాలని కవిత నాయకులను దిశానిర్దేశం చేస్తున్నారు. అలాగే మనం సాధించిన ప్రతీ హక్కును కార్మికులకు వివరించాలని కోరుతున్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ఓటమి పాలైందని ఎవరూ బాధపడొద్దని, అధైర్యపడొద్దని, ఎలాంటి సపోర్టు లేనప్పుడే కొట్లాడి తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చుకున్నామని, అదే స్ఫూర్తితో ముందుకుసాగుదామని నాయకుల్లో ధైర్యం నింపుతున్నారు. ఓడినా ఎల్లప్పుడూ మీ ముందే ఉంటామని, ప్రజల, కార్మికుల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటామని, పార్టీ కార్యకర్తలు, యూనియన్ నాయకులను కంటిరెప్పలా కాపాడుకుంటామని భరోసా ఇస్తున్నారు. తెలంగాణకే తలమానికం అయిన సింగరేణిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనదేనని సింగరేణి ఇతర యూనియన్లు, పార్టీల చేతిలోకి వెళ్తే సంస్థ మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని కవిత నాయకులకు తెలిపారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో పట్టుదలతో పనిచేయాలని ఏరియాల వారీగా ఇన్‌చార్జిలను నియమిస్తామని, త్వరలో మేనిఫెస్టోను విడుదల చేస్తామని నాయకులతో కవిత చెప్పారు.



భూపాలపల్లి టీబీజీకేఎస్ నేతలతో ఎమ్మెల్సీ కవిత (ఫైల్)

## 1998లో తొలిసారి ఎన్నికలు

సింగరేణి కాలరీస్ కంపెనీలో ప్రభుత్వం 1998లో తొలిసారి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించింది. 1998కి ముందు సింగరేణి కాలరీస్ కంపెనీలో సుమారు 78 కార్మిక సంఘాలు తమ కార్యకలాపాలు నిర్వహించేవి. దీంతో ప్రతీ సంఘంతో యాజమాన్యం సంప్రదింపులు జరుపడం ఇబ్బందిగా మారి పారిశ్రామిక సంబంధాలకు విఘాతం కలిగేది. మాటిమాటికి సమ్మెలు జరిగేవి. దీంతో ప్రభుత్వం సింగరేణిలో 1998లో తొలిసారి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించి గెలిచిన సంఘంతో మాత్రమే సంప్రదింపులు జరపాలని నిర్ణయించింది. ఈ క్రమంలో మొదటిసారి 1998లో ఎన్నికలు నిర్వహించగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) విజయం సాధించింది. అప్పుడు గుర్తింపు కార్మిక సంఘం కాలపరిమితి రెండేళ్లు ఉండేది. అనంతరం 2001లో రెండోసారి జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో మళ్లీ అదే యూనియన్ రెండేళ్ల కాలపరిమితితో గెలుపొందింది. మూడవసారి 2003లో ఎన్నికలు జరగగా మళ్లీ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గెలుపొందగా ప్రభుత్వం అప్పుడు నాలుగేళ్ల కాలపరిమితిని నిర్ణయించింది. అనంతరం 2007లో నాలుగోసారి మళ్లీ అదే సంఘం విజయం సాధించింది. ఈక్రమంలో నాలుగు సార్లు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గుర్తింపు సంఘంగా కొనసాగింది. 2012లో ఐదవ సారి జరిగిన ఎన్నికల్లో టీబీజీకేఎస్ విజయం సాధించింది. అనంతరం 2017లో జరిగిన ఆరవ సారి గుర్తింపు సంఘం ఎన్నికల్లో మళ్లీ టీబీజీకేఎస్ విజయం సాధించింది. ప్రస్తుతం ఏడవ సారి సింగరేణి ఎన్నికల్లో గుర్తింపు సంఘం ఎన్నికలు జరుగుతున్నాయి.

# నల్లనేలలో గుర్తింపు పోరు



### ఈ నెల 27న సింగరేణి ఎన్నికలు.. 11 ఏరియాల్లో 39,832మంది కార్మికులు


**బరిలో 13 కార్మిక సంఘాలు.. నాలుగు సార్లు ఏఐటీయూసీకి, రెండు సార్లు టీబీజీకేఎస్‌కు గుర్తింపు హోదా**

**టీబీజీకేఎస్ నేతలతో ఎమ్మెల్సీ కవిత వరుస భేటీలు.. గెలుపే లక్ష్యంగా కార్యాచరణ**

జయశంకర్ భూపాలపల్లి, డిసెంబర్ 8(నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో, 11 ఏరియాల్లో విస్తరించి ఉన్న సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌లో ఈ నెల 27న గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికలు జరగనున్నాయి. సంస్థలో పనిచేస్తున్న 39,832 మంది కార్మికులు ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకుని ఏదో ఒక సంఘానికి గుర్తింపు హోదా తీర్పు ఇవ్వబోతున్నారు. 13 కార్మిక సంఘాలు ఈ ఎన్నికల్లో పోటీ పడుతున్నాయి. ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో ఈ నెల 4న అన్ని కార్మిక సంఘాల నాయకులతో హైదరాబాద్‌లో డిప్యూటీ చీఫ్ లేబర్ కమీషనర్ తన కార్యాలయంలో సమావేశం నిర్వహించి ఓటర్ల జాబితాను అందజేశారు. సింగరేణిలో నాలుగు సార్లు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ), రెండు సార్లు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్)లు గుర్తింపు కార్మిక సంఘం హోదా దక్కించుకున్నాయి. ప్రస్తుతం 7వ సారి జరుగనున్న గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో గెలుపొందేందుకు సంఘాలు పోటీ పడుతున్నాయి. అక్టోబర్ 19న సింగరేణి ఎన్నికలు జరుపాలని డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషన్ నిర్ణయించగా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా డిసెంబర్ 27కి వాయిదా వేస్తూ హైకోర్టు తీర్పును ఇచ్చిన విషయం తెలిసిందే.

### సింగరేణిలో పొత్తు పొసిగేనా..!

ఇటీవల జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ, సీపీఐ అనుబంధ ఏఐటీయూసీ నాయకులు సింగరేణిలోని కోల్‌బెల్ట్ ఏరియాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం విశేష కృషిచేశారు. కోల్‌బెల్ట్ ఏరియాలోని కాంగ్రెస్ అభ్యర్థులు అందరూ ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. వారి గెలుపు వెనుక ఏఐటీయూసీ నాయకుల శ్రమ ఎంతో ఉంది. కాగా ప్రస్తుతం సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ అనుబంధ సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్(ఐఎన్‌టీయూసీ), సీపీఐ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ)లు పోటీలో దిగుతున్నాయి. గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వారి అనుబంధ ఐఎన్‌టీయూసీ గెలుపునకు కృషి చేయాలా.. మరోవైపు వారి విజయానికి కృషి చేసిన ఏఐటీయూసీ నాయకులకు సహకరించాలా..? లేక డివిజన్లను పంచుకుని పొత్తుతో పనిచేయాలా అనే విషయమై సందిగ్ధం నెలకొంది. ఈ పరిస్థితి రెండు యూనియన్ల కేడర్లను డైలమాలో పడేసింది.



### 39,832 మంది ఓటర్లు

సింగరేణిలోని 11 ఏరియాల్లో 39,832 మంది కార్మికులు పనిచేస్తున్నారు. బెల్లంపల్లి ఏరియాలో 985 మంది, మందమర్రిలో 4876మంది, శ్రీరాంపూర్‌లో 9124, కార్పొరేట్‌లో 1112, కొత్తగూడెంలో 2370, ఇల్లెందులో 603, మణుగూరులో 2414, రామగుండం-1లో 5430, ఆర్జీ-2లో 3479, ఆర్జీ-3లో 3063, భూపాలపల్లిలో 5350 మందితో పాటు అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టులో 944 మంది, నైనిలో ఇద్దరు కార్మికులు పనిచేస్తున్నారు. కాగా సింగరేణిలోని మందమర్రి, శ్రీరాంపూర్, ఆర్జీ-1, భూపాలపల్లి డివిజన్లలో అత్యధికంగా కార్మికులు ఉన్నారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలుపు, ఓటములను నిర్ణయించే ఈ నాలుగు డివిజన్లపైనే కార్మిక సంఘాలు ఎక్కువగా దృష్టి సారిస్తున్నాయి. గతంలో జరిగిన గుర్తింపు ఎన్నికల్లో ఈ నాలుగు డివిజన్లు గెలుపు బాటలు వేశాయి.